ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024



అలరించిన 'యెల్లా' మృదంగం

విజయనగరం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ, మృదంగ సార్వభౌమ బిరుదాంకితుడు డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు తన మృదంగ విన్యాసంతో విజయనగరంలోని సంగీత ప్రియులను కొన్ని గంటల పాటు కట్టిపడేశారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆయన రోటరీ కమ్యూనిటీ హాలులో జయ లయోత్సవం ..విద్యాలోలం.. విదళిత కాలం పేరుతో చేపట్టిన మృదంగ కచేరీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వాయిద్యానికి సంగీత ప్రియులు మంత్రముగ్ధులయ్యారు. ప్రేక్షకుల కరతాల ధ్వనులతో సభా ప్రాంగణం హోరెత్తింది. ఆయనకు పేరీ త్యాగరాజు వయోలిన్, పవన్‌కుమార్ కీబోర్డుతో సహకారం అందించారు. తొలుత యెల్లా వెంకటేశ్వరరావును నిర్వాహకులు, సంగీత ప్రియులు ఘనంగా సత్కరించారు. విశిష్ట అతిథిగా ఎస్పీ వకుల్‌జిందాల్ హాజరయ్యారు. డా.గోపాలరావు మాస్టారు, ఎఫ్ఎఫ్ఏ కార్యదర్శి మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ మండపాక రవి, మృదంగ కళాకారులు దువ్వాడ ధర్మారావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతన్నకు కష్టం



గంట్యాడ మండలం సిరిపురం గ్రామంలో నీటిలో వరి పనలు

కలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వరి పంటకు తొలుత రెల్లిరాల్చు పురుగు సోకడంతో వెన్ను విరిగి కొంత నష్టం వాటిల్లింది. మిగిలిన పంటనైనా దక్కించుకుందామని అనుకున్న సమయంలో తుఫాన్ విరుచుకుపడింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నీటిపాలైంది. జిల్లాలో 93,300 హెక్టార్లలో వరి సాగు చేశారు. 60,900 హెక్టార్లలో కోతలు పూర్తి చేశారు. 439 హెక్టార్లలో పంట కోసినప్పటికీ వరిపనలు పొలంలోనే ఉన్నాయి. వీటికే ఎక్కువ నష్టం వాటిల్లే అపాయం పొంచి ఉంది.

పంట వివరాలు నివేదించండి: కలెక్టర్

దెబ్బతిన్న పంట వివరాలను రెండు మూడు రోజుల్లో నివేదించాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు నుంచి వినతులు స్వీకరించాక జిల్లా అధికారులతో సమీక్షించారు.

భూ మాయ

ఐదు కాదు పది కాదు ఏకంగా 500 ఎకరాల ప్రభుత్వ భూమి పరాధీనమైపోయింది. కాసుల కక్కుర్తితో నిబంధనలను నిలువెత్తు గోతిలో పాతరేసి మండల స్థాయి రెవెన్యూ అధికారి ఆ భూమిని పప్పుబెల్లాల్లా పంచేసిన భారీ కుంభకోణం తాజాగా వెలుగుచూసింది. ఒక మండల స్థాయి అధికారి ఇంత పెద్ద భూబాగోతం నడపడం ఉన్నతాధికారులను సైతం నివ్వెరపరుస్తోంది. ఇప్పటికే రాజధాని స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. అత్యున్నత స్థాయి విచారణ జరుగుతోంది. సూత్రదారులు, పాత్రదారుల లెక్క తేలాక కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



- 500 ఎకరాల ప్రభుత్వ భూమి పరాధీనం
- ఎకరాకు రూ.లక్ష చొప్పున మామూళ్లు
- రూ.5కోట్లపైనే అక్రమ ఆర్జన
- డమ్మీ డి.పట్టాలు, అనామతు పాసు పుస్తకాలు
- మండల రెవెన్యూ అధికారి లీలలు
- ఎమ్మెల్యే ఒత్తిడివల్లేనని జేసీకి ఇటీవల వెల్లడి

మామూళ్లు తీసుకుని డి.పట్టాలు ఇచ్చింది ఈ భూమిపైనే..



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత బాధితులు



డి.పట్టా పాసు పుస్తకం

మెంటాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ ఏలుబడిలో ఈ మండలం భూ కుంభకోణాలకు కేరాఫ్ అడ్రసుగా పరువమాసింది. తవ్వినకొద్దీ ఎక్కడికక్కడ భూబాగోతాలు వెలుగుచూశాయి. నిబంధనలు, మార్గదర్శకాలను కాగితాలకే పరిమితం చేసి నాటి అధికార పార్టీ నేతల అండదండలతో పెద్దఎత్తున సర్కారు భూమిని ఇష్టానుసారంగా బడాబాబులకు కట్టబెట్టిన ఉదంతాలు కోకొల్లలు. అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా మాజీ సైనికులకు పెద్దఎత్తున భూమిని మంజూరు చేసి పట్టాలు ఇచ్చిన ఉదంతం మొన్నటికిమొన్న బయటపడింది. ఈ క్రమంలో పూర్వ కలెక్టర్ సూర్యకుమారి నుంచి అందిన నివేదికపై విచారిస్తున్న ప్రభుత్వం అక్రమార్కుల లెక్క తేల్చేందుకు ఈ మండలంలోని ప్రభుత్వ భూములను హోల్డ్‌లో పెట్టింది. ఈ భూములకు 1బీ జారీ నిలిపివేసింది.

బయట పడిందిలా..

1బీలు జారీకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న మెంటాడ గ్రామానికి చెందిన సుమారు 60 మంది దళితులు సోమవారం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావును కలిశారు. తమకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారని, నిన్నమొన్నటి వరకు 1బి కూడా జారీ అయ్యేవని, రైతుభరోసా కూడా మంజూరయ్యేదని చెప్పారు. ఇప్పుడు పీఎం కిసాన్ యోజనకు దరఖాస్తుకు 1బి కోసం వెళ్తే మీ భూములు హోల్డ్‌లో ఉన్నట్టు మీసేవ నిర్వాహకులు చెబుతున్నారని వాపోయారు. తహసీల్దార్ దీనిపై గిరిజనులను ఆరాతీయగా, 2021లో తమవద్ద కొంత డబ్బు వసూలు చూసి డి.పట్టాలు ఇవ్వడమే కాకుండా పట్టాదారు పుస్తకాలు కూడా మంజూరు చేసారని, 1బిలు జారీ అయ్యేవని, వాటి ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు కూడా పొందేవారమని వివరించారు. దీంతో ఆయన కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. వారికి డి.పట్టాలు ఇచ్చినట్టుగాని, పాసు పుస్తకాలు మంజూరు చేసినట్టుగాని ఎక్కడా నమోదు కాలేదు. దీంతో ఆ పట్టాలు, పాసు పుస్తకాలు అనామతువని, అవి చెల్లుబాటు కావని ఆయన స్పష్టం చేయడంతో దళితులు కంగుతిని ఉసూరుమంటూ వెనుతిరిగారు.

500 ఎకరాలు.. 5 కోట్లు!

ఈ బాగోతంలో సుమారు 5 కోట్ల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా, డమ్మీ డి.పట్టాలు, అనామతు పాసు పుస్తకాలు సృష్టించి ఎకరాకు కనిష్ఠంగా లక్ష రూపాయలు చొప్పున 500 ఎకరాలకు రూ.5 కోట్లు వరకు వసూలై ఉంటుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. లబ్దిదారులు కనిష్ఠంగా పది సెంట్లు నుంచి గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు పొందినట్టు భావిస్తున్నారు. అయితే 500 ఎకరాలు అనేది ప్రాథమిక అంచనా మాత్రమేనని, సంతర్పణ జరిగిన భూమి 500 నుంచి 600 ఎకరాలు వరకు ఉండే అవకాశం ఉందని అధికారవర్గాల్లో చర్చ జరగడం గమనార్హం. ఇంత భారీ భూకుంభకోణంలో తెరముందు మండల స్థాయి రెవెన్యూ అధికారి కనిపిస్తున్నా తెరవెనుక బడాబాబులు లేకుండా ఇంత తీవ్రస్థాయిలో అవినీతి జరిగే అవకాశం ఉండదని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. వారిని బయటకు రప్పించేందుకు చర్యలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది.

ఆయనే సూత్రధారి..

మొన్నటికి మొన్న మాజీ సైనికులు మోసపోయిన ఉదంతం, తాజాగా దళితుల వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ఆరాతీయగా ఈ రెండు అంశాలు నాటి మండల స్థాయి రెవెన్యూ అధికారి అవినీతికి మచ్చుతునకలుగా తేలింది. ఆయన హయాంలో కళ్లు బైర్లుగమ్మే భూకుంభకోణాలు జరిగినట్టు ఇప్పటికే ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైనట్టు తెలియవచ్చింది. సుమారు 500 (మిగతా 8వ పేజీలో...)

ఇందులోనూ మాజీ ఎమ్మెల్యే ఉన్నారా?

మాజీ సైనికులకు బురిడీ కొట్టిన ఉదంతంపై విచారణలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ సదరు మండలస్థాయి రెవెన్యూ అధికారితో మాట్లాడినప్పుడు వైసీపీ హయాంలో ఓ ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు అలా చేసినట్టు చెప్పినట్టుగా వెలుగులోకి వచ్చింది. ఆ ఒక్క వ్యవహారంలోనే ఆ మాజీ ఎమ్మెల్యే ఉన్నారా...? తాజాగా వెలుగుచూసిన 500 ఎకరాల భూకుంభకోణంలోనూ ఆయన పాత్ర ఉందా అనే కోణంలో అంతర్గతంగా విచారిస్తున్నట్టు భోగట్టా. సిబ్బంది సహకారం లేకుండా మండల స్థాయి రెవెన్యూ అధికారి ఒక్కరి వల్లే ఇంత స్కామ్ జరిగే అవకాశం తక్కువన్న అభిప్రాయం కూడా తాజాగా వినిపిస్తోంది.



6లో

ఘనంగా పోలిపాడ్యమి

పోలిపాడ్యమిని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నదీ సముద్ర స్నానాలు ఆచరించారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు.

నత్తా నవ్వుతోంది

- నాలుగేళ్లుగా సాగుతున్న పనులు
- పూర్తికాని వార్డుల నిర్మాణాలు
- రోగులు, వైద్యులు, సిబ్బంది అవస్థలు
- రాజాం సామాజిక ఆసుపత్రిలో పరిస్థితి ఇదీ..

6లో

టీబీ నిర్మూలనకు 100 రోజుల ప్రచారం

7లో

- కలెక్టర్ అంబేడ్కర్

క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలనకు రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమానికి విజయనగరం జిల్లా నుంచే శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 7న ప్రారంభించి మార్చి 17 వరకూ నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

ఘరానా మోసం

- డ్రగ్స్ సరఫరా చేస్తున్నారంటూ మహిళకు బెదిరింపులు
- ఉచ్చు పన్నిన సైబర్ నేరగాళ్లు
- బ్యాంకు ఖాతాకు రూ.40లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసిన బాధితురాలు

విజయనగరం క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఘరానా మోసానికి పాల్పడ్డారు. విశ్రాంత అధ్యాపకురాలికి ఫోన్ చేసి తాము పోలీసులమని, మీరు పంపిన పార్సిల్లో డ్రగ్స్ ఉన్నాయని బెదిరించారు. భయాందోళనకు గురైన ఆమె తన బ్యాంకు ఖాతానుంచి రూ.40,11 000 నగదును నిందితులు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. ఆ వెంటనే నిందితులు మొబైల్‌ను స్విచ్ ఆఫ్ చెయ్యడంతో ఆమె మోసపోయినట్లు గుర్తించింది. ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. ఎస్పీ వకుల్‌జిందాల్ సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు తెలిపారు.

నగరంలోని కొత్తఆగ్రహారం ప్రాంతానికి చెందిన విశ్రాంత అధ్యాపకురాలు ఉసిరకళ సుజాతకుమారికి అక్టోబరు 10వ తేదీన ఉదయం 10.30 గంటల సమయంలో గుర్తు తెలియన వ్యక్తి ఫోన్ చేసి తాము పోలీసులమని, మీరు పంపిన పార్సిల్లో డ్రగ్స్ ఉన్నట్లు కనుగొన్నామని, మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని బెదిరించారు. డీసీపీ స్థాయి అధికారి కేసు విచారిస్తున్నారని, బ్యాంక్ అకౌంట్లో ఉన్న నగదును తాము సూచించిన బ్యాంక్ అకౌంట్‌కు పంపాలని హుకుం జారీ చేశారు. బ్యాంక్ లావాదేవీలపై విచారణ పూర్తి చేసిన తరువాత తిరిగి మీ అకౌంట్‌కి డబ్బులు పంపుతామని చెప్పడంతో ఆమె భయపడి నమ్మేశారు. నిందితులు సూచించిన బ్యాంక్ అకౌంట్‌కు నగదు బదిలీ చేశారు. పోలీసుల సూచనతో సైబర్ పోర్టల్‌లో సకాలంలో ఫిర్యాదు చెయ్యడంతో నిందితుల ఖాతాల్లో రూ.20 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. ఆ వెంటనే ఎస్పీ ఆదేశాలతో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది నిందితుల ఖాతాకు జమైన నగదు వివరాల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించారు.

- జమ్ముకాశ్మీర్‌కు చెందిన ముమిన్‌తారీఖ్ బట్ ఎ-1 గా అరెస్ట్ చేసి విచారణ చెయ్యగా బ్యాంక్‌ఖాతాను సైబర్ నేరాగాళ్లకు అద్దెకు ఇచ్చానని, అకౌంట్లో పడిన నగదు 5 నిమిషాల వ్యవధిలో వేరే ఖాతాకు బదిలీ చేస్తూంటానని, అందుకు, 3 శాతం కమీషన్ ఇస్తారని తెలిపాడు. ఎ-1 ఇచ్చిన సమాచారంతో మహారాష్ట్రకు వెళ్లి ముఠాను గుర్తించారు.
- ఈ ముఠా టెలిగ్రామ్ యాప్ ద్వారా ఇదే తరహాలో దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు దోచుకుంటున్నారు. ముంబయి పూనెకు చెందిన నలుగురు నిందితులను కూడా అరెస్టు చేశారు.

వారి వద్దనుంచి రూ.10 లక్షల నగదు, రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు సీజ్‌చేశామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ కేసుతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్ట్ చేసేందుకు నిఘా పెట్టామని ఎస్పీ తెలిపారు. కేసును సమర్థవంతంగా చేధించిన సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్, పీసీలు, రవి, శంకర్, ఎస్.రవి, కె.సన్యాశినాయుడు, వై.రామరాజులను ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

- గ్రామసభల్లో తీర్మానించిన పనులనే చేపడుతున్నాం: మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమారు రూ.300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. గ్రామ సభల్లో తీర్మానించిన పనులనే చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో చేపడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. రహదారులు, కాలువలు, గోకులాల నిర్మాణం తదితర పనుల ప్రగతిని కలెక్టర్ అంబేడ్కర్ మంత్రికి వివరించారు. పల్లె పండగలో భాగంగా ఇప్పటి వరకూ రూ.200 కోట్ల విలువైన 2165 పనులను మంంజూరు చేయగా, వీటిల్లో ఇప్పటివరకూ 184 పనులు పూర్తి అయ్యాయని, ప్రగతిలో ఉన్న పనులను జనవరి మొదటి వారంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రెండు దశల్లో 1091 గోకులాలను మంజూరు చేశామని, 820 పనులు ప్రారంభం అయ్యాయని, వీటి నిర్మాణం కూడా వారం రోజల్లో పూర్తవ్వాలన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రెండు రోజుల్లో తీర్మానాలను పూర్తి చేసి తమకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకూడదని చెప్పారు. నియోజకవర్గానికి రూ.10 కోట్లతో పెద్ద ఎత్తున తారురోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సమావేశంలో డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.




మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఘనంగా పోలిపాడ్యమి

- నదీ, సముద్ర తీరాల్లో దీపారాధనలు

విజయనగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమిని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం చివరి రోజైన సోమవారం పోలిపాడ్యమి రావడంతో భక్తులు నదీ, సముద్ర స్నానాలు ఆచరించారు. తెల్లవారుజామున చెరువులు, నదుల్లో దీపాలు వదిలి పూజలు నిర్వహించారు. శివాలాయాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆవునెయ్యి వేసి వత్తులను అరటిదొప్పలు, కొబ్బరి చిప్పల్లో వెలిగించి దీపారాదన చేయడం కనిపించింది. నెల్లిమర్ల దగ్గరలోని చంపావతి నదీ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని సముద్ర తీరప్రాంతంలో వేకువ జామునే స్నానాలు ఆచరించారు. పుణ్యగిరి, ధర్మవరం సన్యాశేస్వరదేవాలయం, రామతీర్థంలోని శివాలయం, జిల్లా కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు.


నెల్లిమర్ల సమీపంలో చంపావతి నదిలో భక్తులు వదిలిన కార్తీక దీపాలు




విజయనగరం: విష్ణుమూర్తికి పూజలు చేస్తున్న మహిళలు


నెల్లిమర్ల చంపావతి నదిలో దీపారాధన చేస్తున్న భక్తులు


విజయనగరం: కల్యాణ వేంకటేశ్వర కొలనులో దీపారాధనలో భక్తులు

కిటకిటలాడిన తోటపల్లి..

గరుగుబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమితో నాగావళి పులకించింది. నదీ తీరప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం ముగియడంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అక్కడకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ముందుగా తోటపల్లి దేవస్థానం అర్చకుడు అప్పలాచార్యులు, ఈవో వీవీ సూర్యనారాయణలు నదికి హారతులు ఇచ్చారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లోని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సమగ్ర ప్రగతి పత్రాలు

- విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు
- క్యూఆర్ కోడ్‌తో ప్రగతి నివేదిక
- 7న మెగా పేరెంట్స్‌డే రోజున పంపిణీ
- అదేరోజు పలు అంశాలపై చర్చ



గజపతినగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

కూటమి సర్కారు ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఇందులో భాగంగా ఈనెల 7న మెగా పేరేంట్స్‌డే నిర్వహిస్తోంది. జిల్లాలోని 1796 ప్రభుత్వ పాఠ శాలల్లో ఆరోజున సమావేశం నిర్వహించడానికి విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం రూ.34.11 లక్షలు మంజూరయ్యాయి. తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు జోడించారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరి స్థాయిలో వారు నిధులు సేక రించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షెన్, విద్యార్థుల ప్రగతి, వేడుకలు, స్టేజి నిర్వహణ.. ఇలా 13 కమిటీను ఏర్పాటు చేశారు. ఆ రోజున ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. ఇళ్ల వద్ద సెల్ ఫోన్స్, ట్యాబ్‌లు అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అగాహన కల్పిస్తారు.

అదేరోజు విద్యార్థుల ప్రగతి నివేదిక..

విద్యార్థుల ప్రగతి నివేదికను ఈ సమావేశంలోనే తల్లిదండ్రులకు అందజేయనున్నారు. గతంలో ప్రోగ్రెస్ కార్డులు ఉండేవి. వీటిని ఇప్పుడు అప్‌గ్రేడ్ చేసి హోలిస్టిక్ కార్డుల రూపంలో అందజేస్తున్నారు. కార్డులలో విద్యార్థులు ప్రస్తుతం చదువుచున్న పాఠశాలలో అడ్మిషన్ నెంబరు నుంచి పుట్టిన తేదీ, బ్లడ్‌గ్రూప్, బరువు, బీఎంఐ, గుర్తింపు చిహ్నాలు, ఆధార్ నెంబరు, ఆపార్ ఐడీ, పాన్ నెంబరు, మాతృభాష, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లతో పాటు చిరునామ పూర్తిస్థాయిలో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థుల ఆసక్తులు, సామార్థ్యాలు, వారి వ్యక్తిగత సవాళ్లు, విద్యాపరమైన సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు కావాల్సిన సహకారం (ఉదాహరణకు మార్గదర్శకత్వం, బోధన) గమ్యాలు ఈ కార్డులలో పొందుపరుస్తారు. క్యూఆర్ కోడ్ ఫోన్‌లో స్కాన్ చేస్తే విద్యార్థుల మొత్తం వివరాలు కనిపిస్తాయి.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ..



మెగా పేరెంట్ మీటింగ్ ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రగతి నివేదిక కార్డులు అందజేయడంతో పాటు పాఠశాల అభివృద్ధి, ప్రస్తుతం చేస్తున్న.. చేపట్టే కార్యక్రమాలపై తల్లిదండ్రులతో చర్చిస్తాము. పాఠశాల బలోపేతానికి సాయం చేసిన వ్యక్తులను సన్మానించడం, పాఠశాల అబివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాలతో ఈకార్యక్రమం విజయవంతం చేస్తాం.

-డిప్యూటీ డీఈవో, కె.మోహనరావు

భావి తరాలకు

తెలుగు అందించాలనే

- అమెరికాలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా
- బొబ్బిలి వాసి గాంధీ


9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో చప్ప గాంధీ మాట్లాడుతున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాతృభాషపై మక్కువ.. భవిష్యత్ తరాలకు తెలుగును అందించాలనే ఉద్దేశంతో అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఉన్న 'మనబడి' పాఠశాలలో 160 మంది 5, 6వ తరగతి పిల్లలకు తెలుగు ఉపాధ్యాయుడిగా సేవ చేస్తున్నానని బొబ్బిలి మండలం కమ్మవలస గ్రామానికి చెందిన చప్ప గాంధీ తెలిపారు. సొంత గ్రామానికి ఇటీవల వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 1998 నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం(సీనియర్ సిస్టమ్ ఇంజినీర్) చేస్తూ తెలుగు భాష కోసం అక్కడ నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. అక్కడి తెలుగు సంఘాల్లో చేరి వారితో కలిసి కార్యక్రమాలు చేస్తుంటాను. అమెరికాలోని 48 రాష్ట్రాల్లో 'మనబడి' పేరుతో కేవలం తెలుగు నేర్పించే పాఠశాలలు ఉన్నాయి. అక్కడ 6వ తరగతి ఇక్కడ 10వ తరగతితో సమానం.
- అక్కడ చదివే విద్యార్థులకు ఇక్కడున్న పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి ప్రశ్నపత్రాలు వస్తాయి. మళ్లీ ఆన్సర్ షీట్‌లు కూడా మన ఆంధ్రప్రదేశ్‌లోనే వాల్యూయేషన్ జరుగుతుంది. అమెరికాలో ఉండి కూడా ఎల్లప్పుడూ తెలుగు గురించే ఆలోచిస్తాను. మాతృభాషను ఎప్పటికీ మరువకూడదు.
- 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు హాజరయ్యాను. నవంబరు 22, 23 తేదీలలో ఖతార్ దేశంలోని దోహాలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక, ఖతార్ సంయుక్త నిర్వహణలో ఆ సదస్సు జరిగింది. 'భాషలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం.. కృత్రిమమేధ (ఏఐ) ప్రభావం.. భవిష్యత్తు అవకాశాలు' అనే అంశంపై ప్రసంగించాను. కవితా పోటీల్లో మొట్టమొదటిసారిగా పాల్గొని 3వ స్థానం పొందినందుకు చాలా ఆనందపడ్డాను. ఈ కార్యక్రమంలో భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బహుభాషా పండితులు డా.అద్దంకి శ్రీనివాస్, గేయ రచయిత డా. జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, అనేక మంది సాహితీవేత్తలు, రచయితలు, కవులు సదస్సులో పాల్గొన్నారు.

నత్తా నవ్వుతోంది!

- నాలుగేళ్లుగా సాగుతున్న పనులు
- పూర్తికాని వార్డుల నిర్మాణాలు
- రోగులు, వైద్యులు, సిబ్బంది అవస్థలు
- రాజాం సామాజిక ఆసుపత్రిలో పరిస్థితి ఇదీ..


రాజాం సామాజిక ఆసుపత్రి

రాజాం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

రాజాం సామాజిక ఆసుపత్రిలో అభివృద్ధి పనులు నత్తకూ నవ్వొచ్చే తీరున కనిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పనుల్లో కనీస పురోగతి లేకపోవడంతో ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వైద్యులు, సిబ్బందికీ ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వ తప్పిదమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. చేసిన పనులకు బిల్లులు ఇవ్వక పోవడంతో.. కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా ఒక్కోబెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులుండాల్సిన దుస్థితి నెలకొంటోంది. వైద్యులు సైతం ముగ్గురేసి ఒకే గదిలో కూచుని రోగులను పరీక్షించాల్సిన పరిస్థి ఉంది.


ఓ వార్డు పరిస్థితి..

టీడీపీ హయాంలో..

60 పడకల ఆసుపత్రి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయింది. ఇందులో భాగంగా డెంటల్, నేత్రవిభాగంతో పాటు మరిన్ని మంజూరు చేసింది. ఇందుకు అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని సైతం నియమించింది. పెరిగిన స్థాయి, సిబ్బందికి అనుగుణంగా వసతులు పెంచేందుకు సైతం అనుమతులు ఇచ్చింది. రూ. 6.8 కోట్ల నాబార్డు నిధులు కూడా మంజూరు చేసింది. అయితే 2019లో తెలుగుదేశం అధికారాన్ని కోల్పోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనుల ప్రగతి అటకెక్కింది.


ఒకే గదిలో ముగ్గురు వైద్యులు

ఏడాదిగా నిలిచిన పనులు..

సామాజిక ఆసుపత్రిలో పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ 2020 అక్టోబరు 26న పనులు తిరిగి ప్రారంభించింది. రెండో అంతస్తు నిర్మాణం పూర్తయింది. ఇందులో సూపరింటెండెంట్ రూంతో పాటు కొన్ని పనులు జరిపారు. అయితే వాటికి ఫినిషింగ్ వర్క్ ప్రారంభించలేదు. మొదటి అంతస్తు పిల్లర్లు, బ్లడ్‌బ్యాంక్ గది, ఆపరేషన్ థియేటర్, ఓపీ ఛాంబర్స్, లేబ్ ఏరియా, మేటీవార్డు పునర్నిర్మాణం చేయాల్సి ఉంది. రెండో అంతస్తులో సూపరింటెండెంట్ రూం పనులు నిలిచిపోయాయి. కొంతమేర పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో చేతులెత్తేశారు.


వార్డుల్లో పేరుకుపోయిన నిర్మాణ సామగ్రి

రోగులు, వైద్యుల అవస్థలు..

నిత్యం 400 మంది వరకూ రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగినప్పుడు వారి అవస్థలు వర్ణనాతీతం. వార్డుల పునర్నిర్మాణం, ఫినిషింగ్ వర్క్ పూర్తికాకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరేసి, ముగ్గురేసి రోగులకు చికిత్స అందించాల్సి వస్తోంది. వైద్యుల ఓపీ ఛాంబర్స్ కూడా నిర్మాణదశలో ఉండడంతో ఒకేగదిలో ఇద్దరేసి, ముగ్గురేసి వైద్యులు వరుస క్రమంలో రోగులను పరీక్షిస్తున్నారు. రోగులు వేచి ఉండేందుకు అవసరమైన ఫర్నిచర్ సైతం లేదు. ఆరుబయట, వరండాల్లోనే నిరీక్షించాల్సి వస్తోంది.

ఏడాదిగా పనులు నిలిచిపోయాయి..



ఏడాదిగా ఆసుపత్రిలో పనులు నిలిచిపోయాయి. వార్డుల్లో నిర్మాణ సామగ్రి పేరుకుపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల ఓపీ గదులూ పూర్తికాలేదు. దీంతో ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు రోగుల్ని పరీక్షిస్తున్నారు. ఇన్‌పేషెంట్లు ఎక్కువైనప్పుడు తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది.

-డా. హరిబాబు కరణం, ఆసుపత్రి సూపరింటెండెంట్

న్యూస్ బాక్స్

ఘనంగా దీపారాధన

నెల్లిమర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సోమవారం కార్తీక దీపారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. శివుని విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోలి పాడ్యమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్‌లు డాక్టర్ సన్నిడియోల్, డాక్టర్ విజయ్‌బాబు, ఐక్యూఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ఏఎస్‌పి కోఆర్డినేటర్లు కె.జోగినాయుడు, ఎం.శ్రావణి, శ్యామల పాల్గొన్నారు.

రామతీర్థంలో..

రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి భక్తులు సోమవారం అధిక సంఖ్యలో హాజరయ్యారు. సీతారాములను, ఉమా సదాశివ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున చంపావతి నదిలో దీపాలు వదిలారు.

ఉత్తమ వైద్యుడిగా అనిల్‌కుమార్

లక్కవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ వైద్యుడిగా ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యులు బి.అనిల్ కుమార్ ఎంపికయ్యారు. ఆయనను కలెక్టర్ అంబేడ్కర్, జిల్లా వైద్యాధికారి రాణి అభినందించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది అనిల్‌ను సత్కరించారు.

విజేతకు అభినందన

విజయనగరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెటరన్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచిన రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వాశ్లై కృష్ణంనాయుడును ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం అభినందించారు. ఇటీవల నాసిక్‌లో జరిగిన 3వ జాతీయ స్థాయి వెటరన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు.

రజకుల అభివృద్ధికి కృషి

విజయనగరం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము అన్నారు. జిల్లా రజక సంఘం కార్యాలయంలో సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సాధికార కమిటీ సభ్యులు మలిచర్ల చిట్టితల్లి, కెల్ల సత్యం, సలాది అప్పలస్వామి, వెల్దాటి నాగరాజు, తామాడ అచ్చన్న, కొలేటి శ్రీను, గురుమూర్తి, కెల్ల అప్పలరాజు, ఎం.గణేష్ పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల వాటర్ వర్క్స్ నుంచి వచ్చే ప్రధాన పైపులైను ఊటగెడ్డ వద్ద మరమ్మతులకు గురికావడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం ప్రధాన పైపులైను మరమ్మతులకు గురి కావడంతో నగరంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మంగళవారం నాటికి మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని చెప్పారు. దీని కోసం 9550299664 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

దాతలు సహకరించాలి

చీపురుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సహాయంగా వచ్చిన వారి కోసం అమలు చేస్తున్న శాశ్వత అమృత హస్తం కార్యక్రమానికి సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావలని సీఐ జి.శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం ఆసుపత్రిలో 35 మంది సహాయకులకు భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.నాయక్, టీవీ గోవిందరాజులు, వీవీ నారాయణమూర్తి, వి.మోహనరావు, సూరు రవి, ఎం.కృష్ణమూర్తి, హరిప్రసాదరావు, తంగుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి

రాజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చయ్యపేటకు చెందిన అల్లాడ సూర్యారావు మరణానంతరం నేత్రదానం చేసినందుకు వారి భార్య జగదీశ్వరి, కుమారులు సాయి, ప్రకాష్‌లను అభినందిస్తూ రెడ్‌క్రాస్ తరఫున సోమవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బూరాడ శివకృష్ణ, బింగి రంగనాథం, కోటీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు

భోగాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో తూడెం హైస్కూల్‌కు చెందిన డి.దుర్గాదేవి, ఆర్.మహాలక్ష్మి అనే విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్టు హెచ్ఎం వి.అప్పన్న, పీఈటీ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. గత నెల 28 నుంచి 30 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. డి.దుర్గాదేవి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు.

మార్చి నాటికి ఆసుపత్రి భవనం పూర్తి చేయండి: మంత్రి

గజపతినగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి నాటికి ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేసి, సేవలందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసినట్టు చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు నిలిచిపోయాయయన్నారు .వైద్యులకు అవసరమైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల సమయంలో రోగుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయన్నారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి అదనంగా రూ.కోటి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆసుపత్రి ప్రహరీతో పాటు మార్చురీ గది నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. జనవరి నెలలో సమావేశం ఏర్పాటు చేసేనాటికి 90 శాతం పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి శ్రీనివాస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ డిప్యూటీ ఈఈ నరేంద్రనాథ్ రెడ్డి, ఆసుపత్రి సూపరెంటెండెంట్ జగదీష్ కుమార్, సీఐ రమణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, అసెంబ్లీ పోల్ పరిశీలకులు పి.వి.వి.గోపాలరాజు, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, నాయకులు శీరం రెడ్డి రాంకుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నిధులు కేటాయిస్తా: కోళ్ల

లక్కవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి నిధులు కేటాయించి.. అభివృద్ధికి సాయపడతానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ అభివద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో మూడు నెలల్లో కొత్త పీహెచ్‌సీ భవనం అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంపీ నిధులతో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రులన్నీ భ్రష్టు పట్టాయని, వాటిని పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు బి.అనిల్‌కుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

48 గంటలలోనే రైతుల ఖాతాల్లోకి నగదు



కొత్తవలస: పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారి

కొత్తవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం సాయంత్రం బలిఘట్టంలో ధాన్యం కొనుగోలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినా నెలల తరబడి రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేవి కావని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల కష్టాలు తీరిపోయాయన్నారు. దళారుల మాటలు నమ్మి ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాలలో రూ.500 కోట్లు జమయినట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ విజయ, తెలుగుదేశం నాయకులు బొబ్బిలి అప్పారావు, గొరపల్లి రాము, కొరుపోలు అప్పారావు, రెడ్డి పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కంకణం

శృంగవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం పుణ్యగిరి, యడ్లవీధి, ఎస్సీ కాలనీల్లో రూ.25లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. స్థానికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, సాయిరాం, జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పార్వతీపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించాలని సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమక్రసీ లిబరేషన్ నాయకులు రెడ్డి వేణు, తోట జీవ, బొత్స నరసింగరావు, పోలా రమణి, పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో జేసీకి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎటువంటి విద్యుత్ భారాలు ప్రజలపై వేయబోమని చెప్పి విద్యుత్ చార్జీలు పెంచడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు పేరుతో ప్రజల నుంచి డబ్బులు విద్యుత్ చార్జీల రూపంలో అదనపు వసూలు చేయడంలో అర్థం లేదన్నారు.

కొళాయి చార్జీలు వసూలు చేయండి

సాలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బకాయి పడిన కొళాయి చార్జీలను తక్షణమే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి పడిన యజమానులపై కోర్టు కేసులు వేసి, వసూలు చేయాలని ఆదేశించారు. ఇంకా బకాయి పడిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, పెద్ద మార్కెట్ షాపుల లీజులు త్వరితగతిన చెల్లించి సాలూరు పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తొలగింపు అక్రమమని..

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట గ్రామంలోని అంగన్‌వాడీ హెల్పర్‌ను అక్రమంగా తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ హెల్పర్ సౌజన్యను రాజకీయ కారణంగా తొలగిస్తున్నారని తెలిపారు. అనంతరం జేసీ సేతు మాధవన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు వి. లక్ష్మి, టీవీ రమణ; సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బి.సూర్యనారాయణ కోరారు. సోమవారం రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాలవలసలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ మృతి చెందిన బోనెల రాము కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ఈమేరకు ఎంపీడీవో కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

గంజాయి వ్యాపారులపై దృష్టి: డీఐజీ



సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు చేయనున్నట్టు డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. గంజాయి వ్యాపారుల ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిపై శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిందితుల పేరున గుర్తించిన ఆస్తులను జప్తు చేసేందుకు విధి విధానాలు, నిబంధనలను అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీలు వకుల్ జిందాల్, మహేశ్వరరెడ్డి, అమిత్‌బర్దార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించండి

విజయనగరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదులు, వినతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో 25 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించినవి 4, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లుగా 3, ఇతరత్రా అంశాలకు సంబంధించి 15 ఫిర్యాదులు ఉన్నాయి. వీటిని ఏడు రోజుల్లో పరిష్కరించి తీసుకొన్న చర్యలు, వివరాలు జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు 100 రోజుల ప్రచారం: కలెక్టర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తదితరులు

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలనకు రాష్ట్ర వ్యాప్తంగా 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమానికి విజయనగరం జిల్లా నుంచే శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబరు 7న ప్రారంభించి మార్చి 17 వరకూ నిర్వహించనున్నట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. సోమవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి... టీబీపై అవగాహన కల్పించాలని చెప్పారు. కళాశాలల సమీపంలో సిగరెట్ల విక్రయాలు జరగకుండా పాన్ షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీబీ నిర్మూలనా కార్యక్రమం జేడీ టి.రమేష్, ఎంఎల్‌సిలు ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సురేష్ బాబు, డీఎంహెచ్ఓ కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీలను కొనసాగించాలి

గజపతినగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగానికి వాడే విద్యుత్ బిల్లులో ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం రాయితీలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈ మేరకు ధర్నా చేశారు. రాయితీలు వర్తింపజేయాలని కోరుతూ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సర్దుబాటు చార్జీలపై నేడు నిరసన

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపునకు నిరసనగా మంగళవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టనున్నట్టు సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీల విధానాన్ని రద్దు చేయాలని, స్మార్టు మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

పూజా సామగ్రి చెరువులో కలపాలని వెళ్లి..



ఎల్లాజి(ఫైల్)

భోగాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూజా సామగ్రిని చెరువులో కలపాలని వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలివీ.. పోలిపల్లికి చెందిన కోనాడ ఎల్లాజి (30) సోమవారం పూజా సామగ్రిని చెరువు నీటిలో కలిపేందుకు పోలిపల్లి నుంచి లింగాలవలస మధ్య గల చెరువు వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ విద్యుతు వైరు తెగి పడి ఉంది. దీనిని గమనించకుండా వెళ్లడంతో విద్యుత్తు వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నెల్లిమర టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మండల టీడీపీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్తు అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని... కండక్టర్ వైర్లు బాగోకపోవడంతో తెగిపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మృతుడికి తల్లిదండ్రులు దానయ్యమ్మ, దానయ్య, తమ్ముడు ధనరాజ్ ఉన్నారు. ధనరాజ్ ఇచ్చిన ఫిరాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

జియ్యమ్మవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి పంచాయతీ పరిధిలోని ప్రతాప్‌నగర్ కాలనీలో సోమవారం సాయంత్రం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమయ్యింది. గొట్టిపల్లి ముత్యాలమ్మ ఇంట్లో గ్యాస్ లీకవ్వడంతో నిప్పంటుకుని సిలిండర్ పేలింది. ముందుగానే ముత్యాలమ్మ, ఆమె కుమారుడు సింహాచలం, వృద్ధురాలు గుంప నారాయణమ్మ వెంటనే ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. మండల కోఆప్షన్ మెంబరు శివప్రసాద్ బ్రహ్మ స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, స్థానిక ఎస్ఐ పి.అనీష్‌కు, గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చేలోగా స్థానికులే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎస్ఐ అనీష్ వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు గానీ, ఇంట్లో ఫర్నీచర్, దుస్తులు, కొంత నగదు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు

పూసపాటిరేగ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిప్పలవలస గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక మహిళను స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధర్యంలో పట్టుకొని 22 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మరొకరి వద్ద 11 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు.

హెల్మెట్‌ను విధిగా ధరించండి

సంతకవిటి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు సూచించారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ ధరించకపోవడం వల్లనే అత్యధిక శాతం మృతి చెందుతున్నారని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలిస్తాం



మధ్యాహ్న భోజన వంటలను రుచి చూస్తున్న దృశ్యం

గుర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశీస్తామని చీపురుపల్లి నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు చెప్పారు. కలవచర్ల, గుర్ల, కోటగండ్రేడు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక ప్రైమరీ స్కూల్, జెడ్పీ పాఠశాల, బీసీ బాలుర హాస్టల్, గుర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలవచర్ల ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించారు. ప్రమాదకర స్థితిలో ఉన్నందున తక్షణమే భవనాన్ని కూలదోసి..కొత్తది నిర్మాణానికి ప్రతిపాదించాలని ఎంఈవో భానుప్రకాష్‌కు ఫోన్‌లో సూచించారు. కలవచర్ల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరిందని, బెడ్స్ లేవని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని వెల్ఫేర్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. గుర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనాలను పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తను తొలగించాలని సెక్రటరీకి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు సంతోష్, నాయకులు పల్లి సత్యనారాయణ, యడ్ల సంతోష్, కూర్మారావు, బాలకృష్ణ, అప్పల నాయుడు, జనసేన శంకర్ పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై ఆందోళన



డెయిరీ గేట్లు తోసుకొని వెళుతున్న పాడి రైతులు

అక్కిరెడ్డిపాలెం (విశాఖపట్నం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాడి రైతులు సోమవారం విశాఖ డెయిరీ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు నిలువరించినప్పటికీ పాడి రైతులు డెయిరీ గేట్లు తోసుకుని ఎండీ కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఆవు పాల సేకరణ ధరను డెయిరీ యాజమాన్యం తగ్గించడాన్ని నిరసిస్తూ విజయనగరం పాడి రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ పాడి రైతులు సోమవారం విశాఖ నగరంలో గల డెయిరీ మెయిన్ గేటు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాల సేకరణ ధరలను పెంచవలసిన యాజమాన్యం అందుకు విరుద్ధంగా తగ్గించడం సిగ్గుచేటన్నారు. డెయిరీని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సహకార చట్టం పరిధిలోకి తీసుకొని, యాజమాన్యం చేసిన అవినీతిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రైతులను, కార్మికులను ఆదుకోవాలన్నారు. సుమారు మూడు గంటలపాటు నిరసన చేపట్టినప్పటికీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మెయిన్ గేటుకు అడ్డుగా ఉన్న పోలీసులను తోసుకుంటూ రైతులు లోపలకు వెళ్లారు. ఎండీ కార్యాలయం ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సౌత్ ఏసీపీ త్రినాథ్ సమస్యను డెయిరీ ఎండీ ఎస్.వి.రమణకు వివరించడంతో ఆయన ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వారి డిమాండ్లను తెలుసుకున్నారు. డిమాండ్లను డెయిరీ యాజమాన్యంతో పాటు త్వరలో జరగనున్న బోర్డు డైరెక్టర్‌ల సమావేశం దృష్టికి తీసుకువెళ్లి నెరవేర్చేందుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు..తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే మరొకసారి డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో రైతు సంఘ నాయకులు ముద్రపు సూర్యనారాయణ, బి.రాంబాబు, గొంప కృష్ణమూర్తి, ఎల్.ఆదినారాయణ, భూలోక నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు కోసం కృషి చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్వనిధి పథకం అమలుతో మరోసారి అవార్డు పొందేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అందరి కృషితో అవార్డు వచ్చిందని తెలిపారు. వచ్చే ఏడాది కూడా మంచి ప్రతిభ కనబరిచే విధంగా కృషి చేయాలన్నారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. రుణ మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భూ మాయ

(ఐదో పేజీ తరువాయి)

ఎకరాల పైబడి ఈయన హయంలో భూ సంతర్పణ జరిగినట్టు ప్రాథమికంగా లెక్క తేల్చినట్టు తెలుస్తోంది.

వెలుగులోకి వస్తున్నాయి..

అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండా పూర్వ తహసీల్దార్ డి.పట్టాలు మంజూరు చేశారు. మాజీ సైనికులకు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు మంజూరు చేసిన అంశంపై విచారణ జరుగుతోంది. దళితులకు పట్టాలు మంజూరు విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం.

- రామమోహన్‌రావు, ఆర్డీవో, బొబ్బిలి

మా రోడ్డును బాగు చేయరూ..



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివరామరాజుపేట గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని, దీనిని బాగు చేయించాలని సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ యువత ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ విషయమై సర్పంచ్ కొట్యాడ ఝాన్సీ మాట్లాడుతూ తమ గ్రామం నుంచి బల్క్‌మిల్క్ సెంటర్ వరకు రోడ్డు గుంతలుగా మారిందని వాపోయారు. గడిచిన ఐదేళ్లలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే స్పందించి తమ రోడ్డును బాగు చేయించాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్, దేముడుబాబు, వాసు, కనకరాజు, గణేష్, రమేష్, పాదం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

బాడంగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గొల్లాది మధుర గ్రామం కామన్నవలసలో తలెత్తిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కె.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ల్యాండ్ రీసర్వే చేపట్టగా, ఆ సర్వేలో కొన్ని సర్వే నెంబర్లు కామన్నవలస రెవెన్యూ పరిధిలో కలిసిపోయాయని తెలిపారు. దీంతో ప్రస్తుత అధికారులు ఆ ప్రాంతం రెవెన్యూ వ్యవహారాలన్నీ లాక్ చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్



ఆర్డీవో కార్యాలయంలో వీసీలో పాల్గొన్న అధికారులు

బొబ్బిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీవో రామ్మోహనరావుతో పాటు బొబ్బిలి మండల, పట్టణానికి చెందిన పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కేబినెట్ భేటీ ఉన్న నేపథ్యంలో ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ పెద్దలు ఎప్పుడు ఏ సమాచారం అడుగుతారోనని అధికార యంత్రాంగమంతా బాగా కసరత్తు చేసుకుని ఫైళ్లను, నివేదికలను సిద్ధం చేసుకున్నారు. మున్సిపల్ కమీషనరు లాలం రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి మజ్జి శ్యామ్‌సుందర్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఐసీడీఎస్, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాళ్లతో ఎనిమిది వాహనాల సీజ్

బొబ్బిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయం జంక్షన్‌లో సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా పరిమితికి మించి రాళ్లు రవాణా చేస్తున్న 8 భారీ వాహనాలను గుర్తించి, సీజ్ చేశామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. పరిమితికి మించి రాళ్లను రవాణా చేయడమే కాక, వాటిని కప్పి ఉంచకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రవాణా చేస్తుండడంతో వాటిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. మెరకముడిదాం తదితర ప్రాంతాల నుంచి బొబ్బిలి వైపు ఈ వాహనాలు వస్తున్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

కోళ్ల ఫారాలు తొలగించాలి

శృంగవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం గ్రామ పరిధిలోని జనావాసాల మధ్యనున్న కోళ్ల ఫారాలను తొలగించాలని సీపీఎం నాయకుడు మద్దిల రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ అరుణ కుమారి, ఎంపీడీవో సతీష్‌లకు వినతిపత్రం అందించారు. కోళ్ల ఫారంతో దుర్గంధం వస్తుండడంతో దళితులు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు.

కూటమి ప్రభుత్వంతో సంతోషం

కొత్తవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని టీడీపీ విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు అన్నారు. సోమవారం ఆయన కొత్తవలసలో మాట్లాడుతూ రైతులు, మహిళలు, ఉద్యోగులు, వితంతు, వృద్ధాప్య, దివ్యాంగులకు చెందిన పింఛన్‌దారులు అందరూ ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

ఇదేనా రాజ్యాంగ నిర్మాతకు ఇచ్చే గౌరవం?



విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

వీరఘట్టం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మెయిన్ రోడ్డులో గతంలో అంబేడ్కర్ విగ్రహం ఉండేది. ఈ జంక్షన్‌ను అంబేడ్కర్ జంక్షన్ అని పిలిచేవారు. అయితే గతంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఈ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించారు. రోడ్డు నిర్మాణం పూర్తయి సుమారు ఏడు నెలలు కావస్తున్నా ఆ విగ్రహాన్ని తిరిగి పునరుద్ధరించలేదు. ఈనేపథ్యంలో కేవీపీఎస్ నాయకులు సోమవారం ఆ జంక్షన్‌ను పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పూర్తయినా విగ్రహాన్ని పునరుద్ధరించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం విగ్రహాన్ని కూడా సక్రమంగా భద్రపర్చలేదన్నారు. ఇదేనా.. రాజ్యాంగ నిర్మాతకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కె.సింహాచలం, శశిభూణ్ పాల్గొన్నారు.

పంట సంరక్షణలో రైతన్న

- వీడని ఫెంగల్ తుఫాన్
- పలుచోట్ల నేలకొరిగిన పంట
- నానా అగచాట్లు పడుతున్న అన్నదాతలు
- వర్షంలోనూ మిల్లులకు ధాన్యం తరలింపు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న చిరు జల్లుల నుంచి తమ పంటను కాపాడుకోవడానికి రైతన్నలు నానా పాట్లు పడుతున్నారు. కొందరు ఇప్పటికే కోతలు కోసి, కుప్పలు వేశారు. వాటిపై టార్పాలిన్లు కప్పి సంరక్షించుకుంటున్నారు. కొన్ని చోట్ల పొలంలో కోసిన పంట ఉంది. పలు చోట్ల ధాన్యం కుప్పలు టార్పాలిన్లతో కప్పి ఉంచారు. సోమవారం కొంతమేర వర్షం తగ్గడంతో చేలు మధ్యలో ఉన్న నీటిని మళ్లించారు. కొంతమంది రైతులు తడిచిన వరి కుప్పలను మొలకల వస్తాయనే భయంతో యంత్రంతో నూర్పులు చేపట్టి, ధాన్యాన్ని ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భోగాపురం, సాలూరు ప్రాంతాల్లో పలుచోట్ల పంట నేలకొరిగింది. బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట, దిబ్బగుడ్డివలస గ్రామాల్లో రైతులు సోమవారం తమ ధాన్యాన్ని వర్షంలో సైతం ట్రాక్టర్లలో లోడింగ్ చేసి మిల్లులకు తరలించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



సాలూరు రూరల్: పంట సంరక్షణ చర్యలు తీసుకుంటున్న మహిళా రైతు



సాలూరు రూరల్: కూర్మరాజుపేటలో వర్షానికి తడుస్తున్న కోసిన పంట



భోగాపురం: నేలకొరిగిన వరి



బొబ్బిలి రూరల్: గోపాలరాయుడుపేటలో ధాన్యం తరలిస్తున్న దృశ్యం



మక్కువ: కొండబుచ్చెంపేటలో తడిచిన వరిచేనును యంత్రంతో నూర్పు చేపడుతున్న దృశ్యం

క్రీడాకారులకు అభినందన

పార్వతీపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జన జాతీయ గౌరవ దివస్-2024లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందనలు తెలిపారు. సోమవారం గిరి ప్రతిభ కార్యక్రమం ప్రారంభోత్సవానికి పార్వతీపురం విచ్చేసిన ఆమె క్రీడాకారులను అభినందించారు. జావలిన్ త్రోలో గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీదరపు చందు, వాలీబాల్‌లో రెండో స్థానంలో నిలిచిన టి.జస్విన్ గ్రూప్‌నకు, వ్యాసరచన పోటీల్లో ఆర్.గౌరీశంకర్‌కు, పెయింటింగ్‌లో జి.దిలీప్, పి.లావణ్యలకు ఆమె అవార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం పొగాకు దుష్ప్రభావంపై వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. కురుపాం ఎమ్మెల్యే, విప్ తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఈవో ఎన్.తిరుపతినాయుడు, ఐటీడీఏ ఏపీవో ఏ.మురళీధర్, పీఈటీ ఎం.వాసుదేవరావు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యాంప్రసాద్, విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పీజీఆర్ఎస్‌కు 108 వినతులు
- కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఉన్న పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ వినతులను స్వీకరించారు. 108 వినతులు అందాయి. ఎప్పటికప్పుడు అర్జీలను పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇచ్చేలా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణ చట్టాల పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో ఉన్న పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం పొగాకు నియంత్రణ చట్టాలు, పొగాకు వల్ల కలిగే నష్టాలపై కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ నియంత్రణ అధికారిగా ఎం.వినోద్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం మేనేజర్ టి.జగన్మోహన్‌రావు, డీపీఎం భవానీ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిల్, బ్లైండ్ స్టిక్ అందజేత

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకున్న ఇద్దరు దివ్యాంగులకు కలెక్టర్ ట్రై సైకిల్, బ్లైండ్ స్టిక్‌ను అందించారు. చింతాడ గ్రామానికి చెందిన తోట ప్రసాద్‌కు ట్రై సైకిల్‌ను, పాలకొండ మండలం పెదకోటిపల్లి గ్రామానికి చెందిన పలక దుర్గారావుకు ఎలక్ట్రానిక్ బ్లైండ్ స్టిక్‌ను అందజేశారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 53 వినతులు

సీతంపేట రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 53 వినతులు వచ్చాయి. సాగునీటి పైపులు ఇప్పించాలని, పాఠశాల అదనపు తరగతి భవనాన్ని మంజూరు చేయాలని, పింఛన్లు, రహదారులు, తాగునీరు.. తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. ఏపీవో జి.చిన్నబాబు, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో నారాయుడు, పీహెచ్‌వో వెంకటగణేష్, ఐకేపీ ఏపీడీ సన్యాసిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఏఎస్పీ

బెలగాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ తెలిపారు. సోమవారం పార్వతీపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఏఎస్పీ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, అలసత్వం వద్దని సూచించా రు. డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, సోషల్ మీడియా సెల్ సీఐ శ్రీనివాసరావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో గ్రీవెన్స్

సీతంపేట రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. సీసీ రహదారులు, సామాజిక భవనాల నిర్మాణం, తాగునీటి సౌకర్యం వంటి సమస్యలను గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తాను ఎప్పుడూ గిరిజనులకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్న తనకు తెలియజేయాలని ఆయన స్పష్టంచేశారు.

ఉరి తగిలించుకుని..

- అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వినూత్న నిరసన
- కొనసాగుతున్న దీక్షలు

సీతంపేట రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గత 13 రోజులుగా ఉద్యోగులు నిరసన దీక్ష చేపడుతున్నారు. దీనిలో భాగంగా సోమ వారం దీక్షా శిబిరం వద్ద తమ సమస్యలు పరిష్కారం కాకుంటే తమకు ఉరే శరణ్యమని తెలుపుతూ మెడకు ఉరి తగిలించుకుని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఈ దీక్షా శిబిరంలో ఉద్యోగులతో పాటు ఏజేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మెడకు ఉరి తగిలించుకుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక

బొబ్బిలి రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి): పారాది జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బెల్లాన సుప్రియ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలికల జట్టుకు ఎంపికయ్యింది. ఇటీవల కాకినాడలో జరిగిన అండర్ 17 బాలికల స్టేట్‌మీట్ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. ఈసందర్భంగా హెచ్ఎం నాగేశ్వరరావు, పీడీ వెంకటనాయుడు సుప్రియను అభినందించారు. విజయనగరం జట్టు జనవరి 6 నుంచి 9 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనుంది. ● బాడంగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొయ్యాన జ్యోతి ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలికల పోటీల్లో ప్రతిభ చూపింది. విజయనగరం జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడంతో ముఖ్యభూమిక పోషించింది. ఈసందర్భంగా జ్యోతిని పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, ఇన్‌చార్జి హెచ్ఎం తెంటు వెంకటలక్ష్మి, పీడీ బంగారునాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



ట్రోఫీలతో సుప్రియ, జ్యోతి

సీసీ రోడ్లకు ప్రాధాన్యం

గుర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు తెలిపారు. సోమవారం గుర్ల మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పీఆర్ పేట, గూడెం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలకూ రూ.10లక్షల వంతున సీసీ రోడ్ల కోసం కేటాయిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, నాయకులు డా.సుంకరి రమణమూర్తి, జిల్లా బీసీ సెల్ నాయకుడు సంచాన సన్యాసినాయుడు గొర్లె రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడిన ఆవు

బొబ్బిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాలేజీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం సమీపంలో తీసిన గుంతలో సోమవారం సాయంత్రం ఓ ఆవు ప్రమాదవశాత్తూ జారి పడిపోయింది. ఆ గుంతలో నుంచి ఆవు బయటకు రాలేక దీనంగా అరుస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే వచ్చి ఆవును బయటకు తీశారు.



ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

మిల్లర్ల తీరుపై అన్నదాతల నిరసన

రేగిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మద్దతు ధర కోసం లక్ష్మీపురం రైతులు రోడ్డెక్కారు. సోమవారం స్థానిక సచివాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ ప్రాంత మిల్లర్లు బస్తా 80 కేజీల కు బదులు నాలుగు కేజీలు అదనంగా దోచుకుంటున్నారని.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిల్లర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ సచివాలయం ముందు నిరసనకు దిగారు. సచివాలయ సిబ్బందికి విషయం తెలియజేశారు. సర్పంచ్ కెంబూరు తేజో వెంకటేశ్వరరావు, పాలదార తిరుపతిరావు, మీసాల లక్ష్మణరావు, జాడ నాగభూషణరావు, మీసాల సత్యంనాయుడు ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. తమకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.



సచివాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

న్యూస్ బాక్స్

దళితుల గర్జనకు తరలి రండి

పాలకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఈ నెల 8న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జనకు విశాఖ తరలి రావాలని దళిత సంఘం నాయకులు ఎద్దు లిల్లీపుష్పనాథం, భరత్‌భూషణ్, బత్తిన మోహన్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

గరుగుబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రావివలసలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, టీడీపీ అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముదిలిబాబు విజయవాంకుశం, రావివలస ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

ఏఏలకు ఏఈవోలుగా పదోన్నతి

గరుగుబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దవోలు, సంతోషపురం గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న బొత్స రాఘవేంద్రరావు, అక్కేన హరీష్‌లు ఏఈవోలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వీరికి ఎంపీడీవో పైడితల్లి సోమవారం ఆర్డర్లను అందజేశా రు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

సీతంపేట రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న దోనుబాయి, సామరెల్లి, పెద్దపొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. మెనూ అమలు, డార్మిటరీ, బాత్ రూంల నిర్వహణ వంటి అంశాలపై పరిశీ లించారు. న్యాయవాది శామ్యూల్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భామిని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక ధర్మారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బస్ షెల్టర్ ప్రారంభం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పిరిడి గ్రామంలో కొల్లి లక్ష్మి జ్ఞాపకార్థంగా ఆమె భర్త కొల్లి రామినాయుడు నిర్మించిన బస్ షెల్టర్‌ను బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.